అభివృద్ధికి అధిక ప్రాధాన్యత : ముదునూరి

ప్రజాశక్తి - మొగల్తూరు
గ్రామంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నామని చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మోడి గ్రామంలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో రూ.ఐదు లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. అలాగే సచివాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం వైద్య సేవలను ప్రజలకు చేరువ చేసేందుకు ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మార్కెట్ మాధవి, జెడ్‌పిటిసి సభ్యులు తిరుమల బాపూజీ, వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు పాల్గొన్నారు.

కంటి మీద కునుకు కరువు..!

పంట పొలాలు కీలక దశలో ఉన్నాయి.. ఈ సమయంలో సాగునీరు ఎంతో అవసరం. లేకపోతే దిగుబడులపై తీవ్ర ప్రభావం పడుతుంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో సాగునీటి అవసరం ఎంతో ఉంది. అయితే పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో సాగునీటి కొరత ఏర్పడి మరికొద్ది రోజుల్లో పంట చేతికొచ్చే వరి పొలాలు నెరలు తీస్తున్న పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో రైతులకు కంటి మీద కునుకు లేక ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



పాలకోడేరులో నెర్రలు తీసిన వరి పొలం

శివారు పొలాలకు అందని సాగునీరు
నెర్రలు తీస్తున్న వైనం
దిగుబడిపై తీవ్ర ప్రభావం
ఆందోళనలో జిల్లా రైతాంగం
పట్టించుకోని పాలకులు, అధికారులు

ప్రజాశక్తి - భీమవరం
గోదావరి జిల్లాలో ఒకటైన డెల్టా ప్రాంతానికి నీటి వనరులు పుష్కలంగా ఉంటాయని గతం నుంచి నానుడి ఉంది. అయితే పాలకులు, ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలు, ఆక్వా సాగుతో సమృద్ధిగా ఉన్న నీటి వనరులు కలుషితమయ్యాయి. దీనికితోడు ఏటా జరిగే ఆధునికీకరణ పనులు పూర్తిస్థాయిలో చేపట్టకపోవడంతో సాగు నీటికి ఆటంకం ఏర్పడుతోంది. ఏటా సార్వా, దాళ్వా అని తేడా లేకుండా సాగునీటికి ఇబ్బందులు తప్పట్లేదు. పట్టించుకోవాల్సిన పాలకులు, అధికారులు పట్టీ పట్టినట్లు వ్యవహరించడంతో సమస్య మరింత జఠిలంగా మారింది.
ఈ ఏడాది జిల్లాలో 2.20 లక్షల ఎకరాల్లో రైతులు సార్వా సాగు చేపట్టారు. సాగు ప్రారంభం నుంచి రైతులను అనేక కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. సాగులో వివిధ రూపాల్లో సమస్యలు తరచూ ఉత్పన్నమవ్వడంతో రైతులు ఆర్థికంగా మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ఏడాది వర్షాలు పూర్తిస్థాయిలో కురవకపోవడం, ఇక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో సాగునీటి ఎద్దడి ఏర్పడింది. దీనికితోడు ఆశించిన మేర ఆధునికీకరణ పనులు చేపట్టకపోవడం కూడా మరో కారణంగా ఉంది. ఈ నేపథ్యంలో కాళ్ల, పాలకోడేరు, భీమవరం, ఆకివీడు, ఉండి, పాలకొల్లు, యలమంచిలి, ఆచంట, పెనుగొండ, నరసాపురం, మొగల్తూరు, పెనుమంట్ర, పోడూరులో సాగునీటికి ఇబ్బందులు ఏర్పడ్డాయి. శివారు ప్రాంత పొలాలకు పూర్తిస్థాయిలో సాగునీరందకపోవడంతో వరి పొలాలు బీటలు తీస్తున్నాయి. ప్రతి ఎకరాకూ పూర్తిస్థాయిలో సాగునీరందిస్తామని చెప్పిన ప్రతినిధులు, అధికారులు ఆ వైపు కనీసం కన్నెత్తి చూడకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

అంతంత మాత్రమే ఆధునికీకరణ..

ఏటా ఆధునికీకరణ పనులు చేయాల్సి ఉంది. అయితే రకరకాల కారణాలు చూపుతూ ఇవి పూర్తిస్థాయిలో చేయడం లేదని రైతులు విమర్శిస్తున్నారు. సాగుకు ముందు చేపట్టాల్సిన పనులు సాగు ప్రారంభమైన తర్వాత చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. దీంతో సాగునీటిపారుదలకు అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయని చెబుతున్నారు. జిల్లాలో ప్రధానంగా 11 పంట కాలువలు, 100కుపైగా ఉప కాలువలు ఉన్నాయి. వీటిలో తూడు తొలగింపు నిమిత్తం ఈ ఏడాది సుమారు రూ.10 కోట్ల వరకూ కేటాయించారు. అయితే పనులు చేపట్టేందుకు సమయానికి గుత్తేదారులు రాకపోవడం, చేసినచోట బిల్లులు సక్రమంగా చెల్లించకపోవడం, పనులు సక్రమంగా చేయకపోవడతో డెల్టా ప్రాంతంలో సాగునీటి ఎద్దడి ఏర్పడింది. తూడు నివారణకు తూతూమంత్రంగా చర్యలు చేపట్టడం, పంట కాలువలు బాగు చేయలేకపోవడంతో ఈ దుస్థితి ఏర్పడింది.

అదనపు భారంతో సతమతం

ఇప్పటికే సాగులో వేల రూపాయలు పెట్టుబడులు పెట్టిన రైతులు సాగునీటి ఎద్దడితో అదనపు పెట్టుబడులు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతులు మరింత ఆర్థిక భారంతో సతమతమవుతున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకూ పెట్టుబడులు పెట్టారు. అయితే సాగునీరు స్థాయిలో అందకపోవడంతో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సాగునీటిని మళ్లించుకుంటున్నారు. ప్రధానంగా ఆయిల్ ఇంజిన్లు ఏర్పాటు చేసుకుని నీటిని తోడుకుంటున్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు అధికంగా ఉన్నప్పటికీ చేసేదేమీ లేక నీటిని తోడుకుంటున్నారు. దీంతో ఎకరాకు రూ.4 నుంచి రూ. 6 వేల వరకూ అదనంగా పెట్టుబడులు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

కలెక్టర్‌కు మొర పెట్టుకున్న ఫలితం శూన్యం

ఈ ఏడాది పాలకోడేరు మండలంలో సుమారు 14 వేల ఎకరాల్లో రైతులు సార్వా సాగు చేపట్టారు. మోగల్లు, పాలకోడేరు, కుమ్మరవల్లిలో సుమారు 2 వేల ఎకరాల్లో సాగునీటి ఎద్దడి ఏర్పడింది. సాగుకు పూర్తిస్థాయిలో సాగునీరందకపోవడంతో పంట పొలాలు బీటలు వారాయి. ఉత్తర పొలాల ఆయకట్టు, గుత్తులవారిపాలెం ఆయకట్టు, కొముదవల్లి, పాలకోడేరు కాలువల పరిధిలోని ఆయకట్టుకు నీటి ఎద్దడి ఏర్పడింది. ఇరిగేషన్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోకపోవడంతో ఇటీవల పాలకోడేరులో నిర్వహించిన జగనన్నకు చెబుతాం కార్యక్రమానికి విచ్చేసిన జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతికి రైతులు సమస్యలను విన్నవించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సమస్యలు పరిష్కరించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. అయితే ఇరిగేషన్ అధికారులు కంటి తుడుపు చర్యగా పరిశీలన చేశారే తప్ప సాగునీరందించేందుకు పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

వ్యవసాయం చేయాలంటే భయమేస్తోంది..

సన్నమండ అబ్బులు, కౌలు రైతు, పాలకోడేరు

ఎనిమిదేళ్ల నుంచి ఎనిమిదెకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాను. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది సాగునీటి ఎద్దడి ఏర్పడింది. ఉత్తర పొలం ఆయకట్టు పరిధిలో సుమారు 15 వందల ఎకరాలకు నీరు అందడం లేదు. ఇప్పటికే ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.25 వేలు పెట్టుబడి పెట్టాను. పొలాలకు నీరు అందకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అసలు వ్యవసాయం చేయాలంటే భయమేస్తోంది.

ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదు

మామిడిశెట్టి శ్రీనివాసరావు, కౌలు రైతు, గుత్తుల వారిపాలెం

30 ఏళ్ల నుంచి కౌలుకు సాగు చేస్తున్నాను. ఈ ఏడాది ఎనిమిదెకరాల్లో సాగు చేపట్టాను. సాగు ప్రారంభం నుంచి అనేక అవరోధాలు ఏర్పడ్డాయి. వాటిని అధిగమించి ముందుకు వచ్చినప్పటికీ సాగునీటి ఎద్దడి ఏర్పడింది. అధికారులకు చెప్పినా ఎవరూ పట్టించుకోలేదు. పంట కాలువ, పంట బోదెల్లో కర్ర నాచు, మంచం కోడు, తూడు పేరుకుపోవడంతో సాగునీటి ఎద్దడి ఏర్పడింది.

ఇంత దారుణం ఎప్పుడూ లేదు..

డి.శ్రీనివాస్, కౌలు రైతు, పాలకోడేరు

కౌలు రైతుగా 25 ఏళ్ల నుంచి సాగు చేస్తున్నాను. సుమారు 25 ఎకరాల్లో సాగు చేపట్టాను. ఇన్నేళ్లల్లో ఎప్పుడూ ఇంత దారుణం చూడలేదు. కష్టనష్టాలను అధిగమించి సాగు చేస్తుంటే కనీసం సాగునీరు కూడా అందించకపోతే ఎలా. ప్రభుత్వం, అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎవరూ సరైన చర్యలు తీసుకోవడం లేదు. ఒక పక్క పంటలు పండక తీవ్రంగా నష్టపోతున్నాం. మరోపక్క ప్రభుత్వ విధానాలతో నలిగిపోతున్నాం.

గల్లంతైన బాలాజీ, రవితేజ, ఫణీంద్ర, సాయికార్తీక్ (సర్కిళ్లలో ఎడమ నుంచి కుడికి)

సజ్జాపురంలో విషాదఛాయలు

కాకినాడ జిల్లాలో గోదావరిలో నలుగురు యువకులు గల్లంతు
మరో ముగ్గురు సురక్షితంగా ఒడ్డుకు

ప్రజాశక్తి - తణుకు టౌన్
పట్టణంలోని సజ్జాపురంలో తీవ్ర విషాద ఛాయలు అలుము కున్నాయి. ఈ ప్రాంతానికి చెందిన నలుగురు యువకులు కాకినాడ జిల్లాలో గోదావరి గల్లంతయ్యారనే వార్త తెలిసి బంధువులు, స్నేహితులు తల్లడిల్లారు.
తణుకులోని సజ్జాపురం ప్రాంతానికి చెందిన ఏడుగురు యువకులు యానాం విహార యాత్రకు వెళ్లారు. అక్కడి నుంచి తాళ్లరేవు మండలం గోపులంక పుష్కర్ ఘాట్‌కు చేరుకుని శనివారం సాయంత్రం స్నానానికి దిగారు. వీరిలో తణుకు ఆర్ట్స్ కళాశాల డిగ్రీ విద్యార్థి తిరుమల రవితేజ, తాడేపల్లిగూడెం వాసవి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు పెండ్యాల బాలాజీ, ముద్దన ఫణీంద్ర గణేష్, తణుకులో పాలిటెక్నిక్ చదువుతూ మధ్యలో మానేసిన హనుమకొండ కార్తీక్ గల్లంతయ్యారు. మరో ముగ్గురు సురక్షితంగా ఒడ్డుకు చేరారు. గల్లంతైన నలుగురు యువకుల్ని రక్షించడానికి ప్రయత్నాలు చేసినప్పటికీ ఉపయోగం లేకపోయిందని తోటి స్నేహితులు కొమిరెడ్డి చైతన్య, సలాది దుర్గ మహేష్ కన్నీరుమున్నీరవుతున్నారు. తమ స్నేహితులను రక్షించడానికి కొబ్బరి మట్టలు, కొబ్బరాకుల సాయంతో ప్రయత్నించామని, గోదావరి ఉధృతి ఎక్కువగా ఉండటంతో సాధ్యం కాలేదన్నారు. తాము కొబ్బరిమట్టల సాయంతో సురక్షితంగా ఒడ్డుకు చేరుకోగలిగామని తెలిపారు. పోలీసు, రెవెన్యూ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టినా శనివారం రాత్రి వరకూ వారి ఆచూకీ తెలియరాలేదు.

పోలీసు అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

పోలీసు అమరవీరులు చిరస్మరణీయులు

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం
విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరులు చిరస్మరణీయులని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. పోలీస్ అమరవీరుల దినం సందర్భంగా శనివారం స్థానిక మార్కెట్ యార్డు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పాల్గొన్నారు. తొలుత జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్ పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల కోసం పోరాడుతూ అమరవీరులైన వారిని స్మరించుకోవడం మన అందరి బాధ్యత అన్నారు. దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో అహర్నిశలూ జవానులు విధులు నిర్వహిస్తుండడం వల్ల మనం హాయిగా జీవనం సాగిస్తున్నామని తెలిపారు. అమరులైన పోలీసుల త్యాగనిరతి స్ఫూర్తిదాయకమని తెలిపారు. పోలీస్ శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ వారి నుంచి స్ఫూర్తిని పొందాలన్నారు. జిల్లా ఎస్‌పి రవిప్రకాష్ మాట్లాడుతూ తాము విధి నిర్వహణే పరమావధిగా భావిస్తామని తెలిపారు. ప్రజల కోసం నిరంతర పోరాటం చేస్తున్న పోలీసుల సేవలు అభినందనీయమన్నారు. దేశ చరిత్రలో పోలీసు సంస్మరణ దినం విశిష్ట దినంగా భావిస్తున్నామన్నారు. జిల్లాలో విధి నిర్వహణలో నరసాపురం టౌన్ వైవిఎన్.ప్రసాద్, మొగల్తూరు ఆర్.శ్రీనివాసులు, పెనుమంట్ర పివి.ప్రసాద్ ఈ ముగ్గురు పోలీసు ఉద్యోగులు, ప్రత్యర్థి దాడుల్లో అమరులై ప్రాణాలు అర్పించారని తెలిపారు. జిల్లా పోలీసు శాఖ బాధిత కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. తొలుత జిల్లా పోలీసు శాఖ రూపొందించిన అమర వీరుల గ్రంథంలో దేశ రక్షణలో ప్రాణ త్యాగం చేసిన అమర వీరుల పేర్లను జిల్లా కలెక్టర్ ఎస్‌పికి అందజేశారు. అనంతరం విధినిర్వహణలో అమరులైన ప్రసాద్, శ్రీనివాసులు, ప్రసాద్ కుటుంబాలను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పి ఎవి.సుబ్బరాజు, ఎటివి రవికుమార్, ఆర్‌డిఒ దాసి రాజు, డిఎస్‌పి బి.శ్రీనాథ్, తహశీల్దారు వై.రవికుమార్, అధికారులు పాల్గొన్నారు.

అధ్వానంగా ఉన్న రోడ్లను నిర్మించాలి

పొలమూరులో సిపిఎం పాదయాత్ర

ప్రజాశక్తి - పెనుమంట్ర
పొలమూరు నుంచి నవుడూరు సెంటర్ వరకూ అధ్వానంగా ఉన్న ఆర్అండ్‌బి రహదారిని తక్షణం నిర్మించాలని సిపిఎం సీనియర్ నాయకులు జుత్తిగ నరసింహమూర్తి డిమాండ్ చేశారు. శనివారం పొలమూరు నుంచి ప్రారంభమైన పాదయాత్రలో ఆయన మాట్లాడుతూ ప్రజలు ఈ రహదారుల వెంట ప్రయాణం చేయాలంటే భయపడుతున్నారన్నారు. వర్షపు నీరు గోతుల్లో చేరి చెరువులను తలపిస్తున్నాయని, దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్అండ్‌బి రహదారులకు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పాదయాత్ర బృందానికి సంఘీభావం తెలియజేస్తూ మాజీ సర్పంచి, టిడిపి నేత చింతపల్లి రామకృష్ణ మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే ఆర్అండ్‌బి రహదారులకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం పొలమూరు గ్రామం నవుడూరు బస్టాండ్ వరకూ పాదయాత్ర నిర్వహించారు. బస్టాండ్ వద్ద జరిగిన సభలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ మాట్లాడుతూ బ్రాహ్మణ చెరువు నుండి వీరవాసరం వరకూ ఆర్అండ్‌బి రహదారి పెద్ద పెద్ద గోతులతో ఉన్న కారణంగా విద్యార్థులు, ప్రజలు నానా అవస్థలు పడుతున్నారన్నారు. తక్షణం రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కూసంపూడి సుబ్బరాజు, సిపిఎం శాఖ కార్యదర్శి రాపాకా ఆశీర్వాదం, చింతపల్లి తిరుమలరావు, బత్తుల విజయ్ కుమార్, రాజారావు, అయినంపూడి బాబూరావు, కోటేశ్వరరావు ఎం.త్రిమూర్తులు, తాళ్లూరి రాము, నారాయణమూర్తి పాల్గొన్నారు.

పాదయాత్ర చేస్తున్న నాయకులు

పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి : సిపిఎం

ప్రజాశక్తి -భీమవరం రూరల్
షాక్ కొడుతున్న కరెంట్ ఛార్జీలను ప్రజలు వ్యతిరేకించాలని సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. దెయ్యాలతిప్ప గ్రామంలో శనివారం సిపిఎం ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కరెంటు బిల్లు చూడగానే ప్రజలకు షాక్ కొడుతోందన్నారు. పెరిగిన బిల్లులతో వారు గగ్గోలు పెడుతున్నారన్నారు. విద్యుత్ వాడకం పెరగకపోయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సర్దుబాటు, ట్రూఅప్ ఛార్జీలు పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నాయని విమర్శించారు. పెంచిన కరెంట్ ఛార్జీలను తగ్గించాలని, సర్దుబాటు ట్రూఅప్ ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కుర్ర మోహన్‌రావు, పి.ఆనందరావు, దాసు, మురారి పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎ వచ్చారు.. వైద్యులేరీ..!

జగనన్న ఆరోగ్య శిబిరం వద్ద రోగుల అసంతృప్తి

ప్రజాశక్తి - వీరవాసరం
జగనన్న వైద్య శిబిరానికి రావాల్సిన వైద్యులు సకాలంలో రాకపోవడంతో వైద్య పరీక్షల నిమిత్తం వచ్చిన రోగులు అధికారుల ముందు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయం పంచాయతీ రాజ్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. శనివారం వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పది గంటలకే గ్రామస్తులు వైద్య శిబిరానికి చేరుకున్నారు. సుమారు 11 గంటలకు భీమవరం ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ వైద్య శిబిరానికి చేరుకున్నారు. అయితే శిబిరానికి సకాలంలో రావాల్సిన వైద్య నిపుణులు అక్కడకు చేరుకోలేదు. వైద్య శిబిరాన్ని ప్రారంభించాల్సిన ఎంఎల్‌ఎ డాక్టర్లు లేకపోవడంతో జనరల్ వైద్య శిబిరాలను ప్రారంభించారు. రోజుకు ఇద్దరు చొప్పున వేర్వేరు ప్రయివేటు స్పెషలిస్టు డాక్టర్లు జగనన్న ఆరోగ్య వైద్యశిబిరాల వద్ద వైద్య పరీక్షలు నిర్వహించే విధంగా ఆదేశాలున్నట్లు సిహెచ్‌ఒ దేవదాసు తెలిపారు. ఎంఎల్‌ఎ వచ్చే సమయానికి కూడా ఆయా డాక్టర్లు రాకపోవడంతో స్థానికుల నుంచి అసంతృప్తి వ్యక్తమైంది.

న్యాయమూర్తులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్
ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు భీమవరం 3వ అదనపు జిల్లా న్యాయమూర్తి పి.సత్యాదేవి పర్యవేక్షణలో న్యాయమూర్తులకు, న్యాయశాఖ సిబ్బందికి, న్యాయవాదులకు బలుసుమూడి పిహెచ్‌సి డాక్టర్ దుర్గ నేతృత్వంలో శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. పని ఒత్తిడితో హాస్పిటల్‌కు వెళ్లే సమయం లేక, ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేస్తున్న ఉద్యోగులకు కోర్టు ప్రాంగణంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి బిపి, షుగర్, హిమోగ్లోబిన్ శాతం వంటి పరీక్షలను నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసినట్లు 3వ అదనపు జిల్లా న్యాయమూర్తి పి.శ్రీ సత్యా దేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు బి.అప్పలస్వామి, ఎ.పవన్‌కుమార్, జి.సురేష్‌బాబు, డి.ధనరాజు, న్యాయవాదులు పాల్గొన్నారు.

పొలాల్లో రైతులు.. సమీక్షల్లో ప్రభుత్వ యంత్రాంగం

సాగునీరందక ఎండిపోతున్న పంటలు

'ఆలూ లేదు.. చూలూ లేదు.. కొడుకు పేరు సోమలింగం' చందంగా జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారుల తీరు తయారైందని రైతులు అగ్గిమీద గుగ్గిల మవుతున్నారు. సాగునీటి సమస్య తీవ్రమై పంటలు ఎండిపోతుంటే అధికారులు ధాన్యం కొనుగోలు ఏర్పాట్లపై సమీక్షల్లో మునిగి తేలుతుండడంపై అంతా విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఏలూరులో జరిగిన సమావేశంలో కైకలూరు ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు అసంతృప్తి, పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామా నాయుడు పోడూరు, యలమంచిలి మండలాల్లో పర్యటన సాగునీటి సమస్య తీవ్రతకు అద్దం పడుతోంది.



అధి కార పార్టీ ఎంఎల్‌ఎనే సాగునీరందించలేని ఎంఎల్‌ఎ పదవి ఎందుకని బహిరంగంగా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధుల ఎదుట అసంతృప్తి వెళ్లగక్కారంటే ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల ఉదాశీన వైఖరిని ప్రతిబింబిస్తోందని చెప్పొచ్చు.
సార్వా సీజన్ ప్రారంభానికి ముందే ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో సాగునీటి సలహా మండలి సమావేశాలను ఆయా జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులు, అధికారుల సమక్షంలో నిర్వహించి కాల్వలకు నీటి విడుదల తేదీ ఖరారు, గోదావరిలో నీటి లభ్యత, ఇతర ఇబ్బందుల గురించి చర్చించారు. సార్వాకు పూర్తిస్థాయిలో సాగునీరందించాలని ఆయా సమావేశాలు నిర్ణయించాయి. అయితే వరిపైరు ఈనిక, పొట్ట దశలో ఉండగా సాగునీటి ఎద్దడి ఏర్పడడం, వర్షాలు ముఖం చాటేయడంతో రైతుల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా మారింది. కాల్వల్లో పూర్తిస్థాయిలో నీరు విడుదల చేసి శివారు ప్రాంతాలకు అందేలా చూడాలని రైతులు ఆయా ప్రాంత అధికారులకు మొర పెట్టుకున్నారు. అయినా స్పందన లేకపోవడంతో సమీప డ్రెయిన్లలో నీటిని ఆయిల్ ఇంజిన్లు పెట్టి తోడి పంటను రక్షించుకునే ప్రయత్నం చేస్తున్నారు. రైతులు రోడ్డెక్కిన చోట, ఉన్నతాధికారులు జోక్యం చేసుకున్న చోట, ప్రజాప్రతినిధులు, ప్రముఖ నేతలు ఆందోళన చేసిన చోట మాత్రమే కొద్దిరోజులు పూర్తిస్థాయిలో నీరందిస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఏలూరు జిల్లాలో ముసునూరు, చాట్రాయి, చింతలపూడి, ఉంగుటూరు, పశ్చిమగోదావరి జిల్లాలో ఆచంట, పెనుమంట్ర, పోడూరు, యలమంచిలి, పాలకొల్లు రూరల్ తదితర మండలాల్లో సాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. దీంతో పొలాలు నెర్రలు తీయడం, బీటలు వారడంతో పంటను ఎలా రక్షించుకోవాలో తెలియక చిన్న, సన్నకారు, కౌలురైతులు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికే వేలాది రూపాయలు పెట్టుబడిగా పెట్టామని, పంట చేతికొచ్చే దశలో నీటి ఎద్దడి కారణంగా దిగుబడి గణనీయంగా తగ్గే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా పెట్టుబడులు కూడా వచ్చే అవకాశం ఉండదని వాపోతున్నారు. దీనికితోడు ఎలుకల బెడద, తెగుళ్ల విజృంభణ రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి సాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుని నీరందిస్తే కనీసం పెట్టుబడులైనా దక్కించు కుంటామని చెబుతున్నారు. ఇదిలా ఉంటే సాగునీటి సమస్య పట్టని జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ధాన్యం కొనుగోళ్ల ఏర్పాట్లపై చర్చోపచర్చలు సాగిస్తున్నారు. ఇప్పటికీ ఎన్ని వాహనాలు అవసరం, జిపిఎస్, హమాలీల ఏర్పాటు వంటి అంశాలపై సమీక్షలు నిర్వహిస్తూనే ఉన్నారు. ధాన్యం కొనుగోళ్లలో గత దాళ్వాలో రైతులు ఎదురు పెట్టుబడి పెట్టాల్సిన పరిస్థితి నుంచి సక్రమంగా రైతులకు ఇబ్బంది లేకుండా అమ్మకాలు సాగేలా అధికార యంత్రాంగం ముందస్తు చర్యలకు ఉపక్రమించడం అభినందనీయం. అయితే తేమ శాతంపై మిల్లర్ల లొల్లి నివారణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారనేది స్పష్టత లేదు. అలాగే గత దాళ్వాలో రైతులకు అందాల్సిన హమాలీల ఖర్చు సొమ్ము జమలో జాప్యంపైనా చర్చ లేదు. పైగా సాగునీటి కొరతతో అసలు ధాన్యం చేతికొస్తుందో.. లేదో తెలియని పరిస్థితుల్లో రైతులు కొట్టుమిట్టాడుతుంటే ఆ సమస్యను పరిష్కరించడం మాని ఈ సమీక్షలు ఏంటని రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే వర్షాభావ పరిస్థితులు, వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్ అందకపోవడం వెరసి పంటలు ఎండి ఏలూరు జిల్లా చాట్రాయి మండలం తదితర ప్రాంతాల్లో పొలాల్లో గేదెలు మేపుతున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ పరిస్థితులన్నీ పరిశీలిస్తే కచ్చితంగా ముందుగా అంచనా వేసిన దానికన్నా ధాన్యం దిగుబడి తగ్గే అవకాశాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. ఇప్పటికైనా సాగునీటి సమస్యను పరిష్కరించని పక్షంలో దిగుబడి గణనీయంగా తగ్గే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. ఈ దశలో అధికారులు, ప్రజాప్రతినిధులు పంటను రక్షించుకునేలా సాగునీరు అందించే చర్యలు చేపట్టాలని, వ్యవసాయ విద్యుత్ నిరంత రాయంగా తొమ్మిది గంటలు సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు. లేనిపక్షంలో 'రైతులకు సాగునీరందించలేని ఎంఎల్‌ఎ పదవి ఎందుకు' అని అధికారపక్షానికి చెందిన కైకలూరు ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు వ్యాఖ్యానించినట్లు వచ్చే ఎన్నికల్లో రైతులు కూడా ఈ ప్రభుత్వం వద్దనే విధంగా తీర్పునిచ్చే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు హెచ్చరిస్తున్నారు.

- వివిఎస్‌వి.ప్రసాద్

ఇవిఎంల తనిఖీకి నేతలు హాజరు కావాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం
ఇవిఎంలు, వివి ప్యాడ్ల తొలిదశ తనిఖీలకు రాజకీయ పార్టీల ప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి కోరారు. శనివారం స్థానిక ఇవిఎం గోడౌన్లను పరిశీలించిన అనంతరం జిల్లా కలెక్టర్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇవిఎంల గోడౌన్ వద్ద ఈ నెల 16వ తేదీ నుంచి తనిఖీ ప్రక్రియ జరుగుతోందని, దీనికి పలు పార్టీల ప్రతినిధులు మాత్రమే హాజరవుతున్నారని తెలిపారు. మిగిలిన పార్టీలు కూడా హాజరు కావాలని కోరారు. తనిఖీలకు హాజరుకాని పార్టీల సమాచారాన్ని ఎన్నికల కమిషన్ దృష్టిలో ఉంచుతామన్నారు. జిల్లాకు 4,650 బ్యాలెట్ యూనిట్స్, 3,640 కంట్రోల్ యూనిట్స్, 4,550 వివి ప్యాడ్లు అందాయని తెలిపారు. మొదటి దశ తనిఖీల్లో భాగంగా ఈ నెల 20వ తేదీ వరకూ 850 బ్యాలట్ యూనిట్లను, 843 కంట్రోల్ యూనిట్లను, 841 వివి ప్యాడ్లను తనిఖీ చేసినట్లు తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా 5 శాతం ఇవిఎంలతో మాక్ పోల్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 1,461 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, అసెంబ్లీ ఎన్నికల కోసం 20 శాతం, పార్లమెంటు ఎన్నికల కోసం మరో 20 శాతం ఇవిఎంలను రిజర్వులో ఉంచడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్‌ఒ కె.కృష్ణవేణి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ లక్కు నరసింహారావు, డిప్యూటీ తహశీల్దార్ ఎం.సన్యాసిరావు, వివిధ పార్టీల ప్రతినిధులు కోమటి రవికుమార్, ఎం.ఆంజనేయులు, కాటూరి కర్ణాకర్, కామన నాగేశ్వరరావు, మరపట్ల శ్యాంబాబు పాల్గొన్నారు.

ఎండిన వరిచేల పరిశీలన

ఆచంట : ప్రతి ఎకరాకూ సాగునీరందిస్తామని, ప్రతి ధాన్యపు గింజా కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించడం తప్ప ఆచరణలో మాత్రం శూన్యమని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరామ్ విమర్శించారు. మండలంలోని ఆచంట వేమవరం, శేషమ్మచెరువు తదితర గ్రామాల్లోని పంట పొలాల్లో శివారు రైతు సంఘం బృందం పర్యటించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగునీరందక వరిచేలు నెర్రలు తీస్తున్నాయని, వేసిన ఎరువులు అలాగే ఉన్నాయని తెలిపారు. అనంతరం ఇరిగేషన్ అధికారితో సాగునీటి సమస్యపై మాట్లాడారు. ఎండిపోతున్న పంట పొలాలకు సమృద్ధిగా సాగునీరందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా దేవ కాలువ చెత్తాచెదారంతో పూడుకుపోయిందని, దీంతో సాగునీరు శివారు గ్రామాలకు అందడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారని తెలిపారు. అనంతరం రైతు భరోసా కేంద్రం వద్ద వ్యవసాయ శాఖ అసిస్టెంట్‌తో మాట్లాడి ధాన్యం కొనుగోలు సమస్యలు పరిష్కరించాలని, గోనె సంచులు అందుబాటులో ఉంచాలని, ఇ-పంట, ఇకెవైసి తదితర సమస్యలు వెంటనే పరిష్కరించాలని, తేమ శాతం రైతు భరోసా కేంద్రం వద్ద చూపిన విధంగా రైస్‌మిల్లు వద్ద కూడా అదే తేమ శాతానికి అన్లోడ్ చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా అగ్రికల్చర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు వీరమల్లు వీర్రాజు, బుర్ర నాగేశ్వరరావు, బాపనయ్య, తాళ్లూరు రాము, పలాస నరసింహమూర్తి పాల్గొన్నారు.

ఎండిన వరి దుబ్బును చూపుతున్న రైతులు, నేతలు

నేడు సిపిఎం జిల్లాస్థాయి విస్తృత సమావేశం

ప్రజాశక్తి - ఆకివీడు

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించేందుకు ఈ నెల 22వ తేదీ ఆదివారం జరగనున్న సిపిఎం జిల్లాస్థాయి విస్తృత సమావేశాన్ని జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మూడు రోజులుగా జరుగుతున్న పార్టీ కార్యకర్తల విస్తృత శిక్షణ తరగతుల అనంతరం శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. జిల్లాలో వివిధ రంగాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి వాటిపై కార్యాచరణ రూపొందించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాలో వ్యవసాయ రంగం కుదేలైందని, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల పేద, మధ్యతరగతి ప్రజానీకం సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఐదేళ్లుగా ప్రభుత్వం వ్యవసాయ రంగానికి కేటాయింపులు చేయడంలో పూర్తి నిర్లక్ష్యం వహించిందన్నారు. సాగునీ రందక శివారు ప్రాంతాల రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పాలకుల విధానాలతో రైతాంగం నష్టాల ఊబిలో కూరుకుపోయారన్నారు. ఆక్వా రైతు లకు విద్యుత్ సబ్సిడీ ఎత్తివేయడం, కమర్షియల్ స్లాబ్ విధానం పాటించడంతో సాగు కష్టమవుతోందన్నారు. ఆక్వారైతులను వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తాళ్లకోడులోని 74 ఎకరాల్లో నిర్మిస్తున్న ఇళ్లకు కనీస మౌలిక సదుపాయాలు లేకపో వడంతో అక్కడ ప్రజానీకం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సౌకర్యాలు కల్పించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి జిల్లా వ్యా ప్తంగా ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో పార్టీ పట్టణ కార్యదర్శి కె.తవిటి నాయుడు, బి.రాంబాబు, ఎస్‌కె.వలీ, బి.వర్మ, ఎస్.సూరిబాబు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పెనుగొండ

జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని జిల్లా హౌసింగ్ అధికారి ఆనంద్‌కుమార్ సూచించారు. జగనన్న కాలనీ నివాసాలను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసినవారికి సకాలంలో బిల్లులు వేస్తున్నామన్నారు.

ప్రత్యేక ఉప కారాగారం తనిఖీ

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి డి.ధనరాజు స్థానిక ప్రత్యేక కారాగారాన్ని శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిందితులు సత్‌ప్రవర్తన కలిగిఉండి నేర ప్రవృత్తిని వీడనాడాలన్నారు. జైలు ప్రాంగణంలో ఆరోగ్యం దృష్ట్యా ఏమైనా ఇబ్బంది ఉంటే న్యాయ సేవాధికార సంస్థ ద్వారా తెలపాలని సూచించారు.

పంచాయతీ కార్యదర్శి అవినీతిపై విచారణ

ప్రజాశక్తి - పాలకోడేరు

మోగల్లు పంచాయతీ కార్యదర్శి కె.వెంకటరాజు వ్యక్తిగత ఖాతాలోకి నగదు జమ చేసుకున్నారని, చెరువులో చేపపిల్లలు వేయకుండా వేసినట్లు చూపించి అవినీతికి పాల్పడ్డారని గ్రామానికి చెందిన నేతల శ్యామ్‌కుమార్ కలెక్టర్ ప్రశాంతికి ఇటీవల ఫిర్యాదు చేశారు. దీనిలో భాగంగా డిపిఒ అధికారుల ఆదేశాల మేరకు డిఎల్‌పిఒ ఎ.కొండలరావు శనివారం మోగల్లు పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి అవినీతిపై విచారణ చేపట్టారు. విచారణ పూర్తిస్థాయిలో నిర్వహించడానికి మరికొంత సమయం పడుతుందని కొండలరావు తెలిపారు. వివరాలను జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక రూపంలో అందిస్తామన్నారు.

సస్యరక్షణ చర్యలతో సుడి దోమ నివారణ

పెనుమంట్ర :ఉభయగోదావరి జిల్లాల్లో వరి పంట ప్రస్తుతం చిరు పొట్ట దశ నుంచి గింజ గట్టిపడే దశలో, కోత దశలో ఉందని, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, ఉక్కపోత వాతావరణం నేపథ్యంలో పురుగులు, తెగుళ్ళు పెరగడానికి అవకాశం ఉందని మార్టేరు వ్యవసాయ పరిశోధన సంస్థ ఎడిఆర్ డాక్టర్ ఎం.భరతలక్ష్మి అన్నారు. శనివారం స్థానికంగా నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. దుబ్బుకు 20 నుంచి 25 దోమలు ఉన్నట్లయితే సస్యరక్షణ చేపట్టాలన్నారు. పొలాన్ని అడపాదడపా ఆరబెట్టాలని తెలిపారు. పురుగుమందులు మొక్క మొదలు తడిచేటట్లుగా పిచికారీ చేయాలని తెలిపారు. దుబ్బుకు 1 లేదా 2 ఆకుముడత లద్దెపురుగు, ఆకుముడత ఆశించిన ఆకులు ఉంటే సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు.

బాబూరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బలరాం

శెట్టిమి బాబూరావు కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - యలమంచిలి

ఇటీవల మృతి చెందిన చించినాడ గ్రామానికి చెందిన సిపిఎం సానుభూతిపరుడు శెట్టిమి బాబూరావు కుటుంబాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, పార్టీ మండల కార్యదర్శి కె.బాలరాజు, సిఐటియు మండల కార్యదర్శి దేవ సుధాకర్‌తో కలిసి పరామర్శించారు. బాబూరావు భార్య మరియమ్మ, సోదరుడు, మరదలు భాస్కరరావు, మణిలను పరామర్శించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ బాబూరావు చించినాడ పోరాటంలో పాల్గొన్నారన్నారు. సిపిఎం నిర్వహించే అన్ని కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారన్నారు. సిపిఎం నిర్వహించిన అనేక బహిరంగ సభల్లో ఉద్యమ పాటలకు డప్పు దరువు వేస్తూ కార్యకర్తలను ఉత్సాహ పరిచేవారన్నారు. వారితో పాటు సిపిఎం నాయకులు స్టాలిన్, వెంకటస్వామి, డివైఎఫ్ఐ నాయకులు పద్మరాజ్, జున్ను, జయరాజ్, సంతోష్, ప్రభుదేవా పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

పేకాట స్థావరంపై దాడి

9 మంది అరెస్టు, రూ.3 లక్షలు స్వాధీనం

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని ఏలూరుపాడులో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి తొమ్మిది మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి నగదు, క్యాసినో కాయిన్స్ స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను కాళ్ల పోలీస్‌స్టేషన్‌లో సిఐ సత్యనారాయణ శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించి వెల్లడించారు. మండలంలోని ఏలూరుపాడులో చేపల చెరువుగట్టు వద్ద పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్‌పి రవిప్రకాష్ సూచనల మేరకు భీమవరం ఎస్‌డిపిఒ, ఆకివీడు సిఐ, కాళ్ల ఎస్ఐ, పోలీస్ సిబ్బంది, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు స్థావరంపై దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురిని అదుపులోకి తీసుకున్నామని, వారిచ్చిన సమాచారం ప్రకారం మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. వారి వద్ద నుంచి రూ.3,16,600 నగదు, 52 పేకముక్కలు, ఒక మోటార్‌సైకిల్, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. తొమ్మిది మంది ఒకరి వద్ద క్యాసినో కాయిన్స్ ఉన్నాయని తెలిపారు. అయితే క్యాసినో తరహాలో ఎటువంటి జూదం జరగలేదని సిఐ తెలిపారు.

ఇదేనా నిష్పాక్షపాత దర్యాప్తు

మండలంలోని ఏలూరుపాడులో చేపల చెరువు యజమాని ఎవరనేది తెలియాల్సి ఉందని పలువురు చెబుతున్నారు. పేకాట స్థావరాన్ని ఎవరు నిర్వహిస్తున్నారో పోలీస్ అధికారులు గుర్తించినా పేరు చెప్పేందుకు మీనమీసాలు లెక్కిస్తున్నారని విమర్శిస్తున్నారు. కాళ్ల పోలీస్ స్టేషన్‌కు ఏలూరుపాడు గ్రామం శివారు కావడంతో అక్కడ నుంచి నిందితులను తీసుకురావడం ఆలస్యమైంది. కాళ్ల ఎస్ఐ వీరభద్రరావు శుక్రవారం రాత్రి పూర్తి సమాచారం ఇవ్వకుండా అయిదుగురిని అదుపులోకి తీసుకున్నామని వారి వద్ద నుంచి రూ.16,610 నగదు, ఒక బైకు స్వాధీనం చేసుకున్నామని సమాచారం ఇవ్వడం సరికాదన్నారు.

వడలిలో పెంకుటిల్లు దగ్ధం

పెనుగొండ :వంట చేస్తుండగా గ్యాస్ లీక్ అవ్వడంతో పెంకుటిల్లు దగ్ధమైంది. ఈ సంఘటన మండలంలోని వడలి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వడలి గ్రామానికి చెందిన ఆంజనేయులు, వెంకట్రావు కుటుంబాల వారు పెంకుటింట్లో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం మహిళలు వంట చేస్తుండగా గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. ఇంట్లో వారు హుటాహుటిన బయటకు వచ్చేశారు. సమాచారం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. సుమారు రూ.2.50 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు తహశీల్దార్ గురుమూర్తి రెడ్డి తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

చెత్తకు నిప్పు.. ప్రజల ఇబ్బందులు

పొగ వ్యాపించడంతో వెలగలేరు గ్రామస్తుల అవస్థలు

చర్యలు తీసుకోవాలని వేడుకోలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

డంపింగ్ యార్డులో చెత్తకు నిప్పు పెట్టడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మార్టేరు గుణ్ణం చెరువు గట్టు పక్కన సంవత్సర కాలంగా పంచాయతీ సేకరించిన చెత్తాచెదారం వేస్తున్నారు. ఆ చెత్తకు నిప్పు అంటించినప్పుడల్లా సమీప గ్రామమైన వెలగలేరు వైపు పొగ కమ్ముకోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆ గ్రామస్తులు వాపోతున్నారు. గతంలో మార్టేరు డంపింగ్ యార్డు కోడేరు రోడ్డులోని శ్మశానవాటిక వద్దకు చేరవేసేవారు. శ్మశానవాటిక అభివృద్ధి చేసిన నేపథ్యంలో గ్రామంలో సేకరించిన చెత్త చెదారం వెలగలేరు సమీప ప్రాంతమైన మార్టేరు గుణ్ణం చెరువు గట్టుకు తరలిస్తున్నారు. అక్కడ తరచూ చెత్తకు నిప్పు పెట్టడంతో ఆ పొగ వెలగలేరు వైపునకు వచ్చి గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పొగ కుమ్ముకున్నప్పుడల్లా ఊపిరాడడంలేదని వెలగలేరు గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలో శ్వాసకోస సంబంధిత వ్యాధితో బాధపడేవారు కూడా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను స్థానికులు మార్టేరు సర్పంచి మట్టా కుమారి, పంచాయతీ కార్యదర్శి కె.సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లినా రోజులు గడుస్తున్నాయే తప్ప సమస్య పరిష్కారం కావడంలేదని వాపోతున్నారు. గ్రామస్తులు వెలగలేరు పంచాయతీ కార్యదర్శి సుధారాణి వద్ద తమ గోడు వెలబెట్టుకున్నారు. ఈ విషయంపై మార్టేరు పంచాయతీ కార్యదర్శి కె.సత్యనారాయణను వివరణ కోరగా చెత్తాచెదారం ఏరుకునే వారు నిప్పు పెట్టే సందర్భంలో పొగ వ్యాపించి ప్రజలు ఇబ్బంది పడుతున్న మాట వాస్తవమేనన్నారు. ఇకపై చెత్తకు ఎవరూ నిప్పు పెట్టకుండా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చెత్తకు నిప్పు పెట్టడంతో వ్యాపిస్తున్న పొగ

సబ్‌జైలులో జైలు అదాలత్

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

స్థానిక సబ్‌జైలును ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీనివాస్ శనివారం సందర్శించి జైలు అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరికైనా న్యాయవాదిని పెట్టుకునే ఆర్థిక స్తోమత లేకపోతే సంస్థ తరపున ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని చెప్పారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నరసాపురం కోర్టు భవనంలో కోర్టు సిబ్బందికి, న్యాయవాదులకు, న్యాయవాద గుమాస్తాలకు మ్యాగ్జీ విజన్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ సహకారంతో ఉచిత కంటి పరీక్షలు, స్థానిక ఏరియా ఆసుపత్రి సహకారంతో ఉచితంగా బిపి, డయాబెటిస్ పరీక్షలు చేసేందుకు వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పదో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ పి.విజయదుర్గ, సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీనివాసు, న్యాయవాది కె.శిరీష, జైల్ సూపరింటెండెంట్ టి.అప్పారావు, సంస్థ సభ్యులు యర్రంశెట్టి దేవేంద్ర ఫణికర్, డాక్టర్ పి.సోని, దివ్య పాల్గొన్నారు.

న్యాయశాఖ సిబ్బందికి వైద్య పరీక్షలు

పాలకొల్లు : పాలకొల్లు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయశాఖ సిబ్బంది, న్యాయవాదులకు పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులచే శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రతి నెలా రెండుసార్లు ఈ వైద్య శిబిరాలను నిర్వహిస్తామని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.వరలక్ష్మి, పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు, న్యాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బిఎస్‌సి కోర్సుల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

డాక్టర్ వైఎస్ఆర్ విశ్వవిద్యాలయం పరిధిలోని 11 ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు హార్టిసెట్ - 2023లో వచ్చిన ర్యాంకు ఆధారంగా బిఎస్‌సి (హార్టికల్చర్) డిగ్రీ కోర్సు ప్రవేశానికి వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సెలింగ్‌కు 300 మంది హాజరయ్యారు. కౌన్సెలింగ్ కేంద్రాన్ని విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ టి.జానకిరామ్ సందర్శించారు.

సచివాలయాల్లో డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలి

కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు పూర్తి వివరాలు అందరికీ తెలిసేలా గ్రామ, వార్డు సచివాలయాల్లో డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి గ్రామ, వార్డు సచివాలయాల్లో మా నమ్మకం నువ్వే జగనన్న ప్రభుత్వ పథకాలు డిస్ ప్లే బోర్డులు ఏర్పాటు, గ్రాస్ ఎన్రోల్మెంటు రేషియో (జిఇఆర్) అంశాలపై మండల ప్రత్యేకాధికారులు, మండల స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శనివారం సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, పూర్తి సమాచారం ప్రజలందరికీ తెలియాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సచివాలయ పరిధిలో ప్రభుత్వ పరంగా జరిగే సభలు, సమావేశాలు తేదీ, సమయం, ప్రదేశం, ప్రజా ప్రతినిధులు పేర్లు, కార్యక్రమం పూర్తి వివరాలను ప్రతి నెలలో మొదటి రోజున డిస్ ప్లే బోర్డులో పొందుపరచాలన్నారు.

పిల్లలు బడిలోనే ఉండాలి

బడి ఈడు పిల్లలు బడి బయట ఉంటే సంబంధిత అధికారులు భాధ్యత వహించాలని కలెక్టర్ హెచ్చరించారు. గ్రాస్ ఎన్రోల్మెంటు రేషియో (జిఇఆర్) మండలాలు, మున్సిపల్ వారీగా సమీక్షించారు. విద్యాశాఖ సర్వే చేసిన సిఆర్ యాప్‌ను, సచివాలయ వాలంటీర్లు సర్వే చేసిన బిఏపి యాప్‌ను పరిశీలించాలన్నారు. జిల్లాలో ఐదు నుంచి 18 ఏళ్ల మధ్య వయసున్నవారంతా బడిలోనే ఉండాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, డిఎల్‌డిఒ కెసిహెచ్.అప్పారావు, జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ, భీమవరం పురపాలక సంఘం కమిషనర్ ఎం.శ్యామల పాల్గొన్నారు.

ధాన్యానికి బోనస్ ప్రకటించాలని వినతి

ప్రజాశక్తి - తణుకు రూరల్

రాష్ట్ర ప్రభుత్వం క్వింటాలు ధాన్యానికి రూ.500 బోనస్ ప్రకటించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చినవీరభద్రరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు స్థానిక దువ్వ ఆర్‌బికె కేంద్రం వద్ద వ్యవసాయ శాఖ గ్రామ అధికారి పుష్పలతకు శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ కష్టపడి పంట పండించిన రైతులకు చివరకు గడ్డి కూడా మిగలడం లేదన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధర సాధారణ రకానికి క్వింటాలుకు రూ.2183, ఎ గ్రేడ్ క్వింటాలుకు రూ.2203 ప్రకటించినప్పటికీ ఈ ధర రైతులకు ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు అదనంగా కేరళ, తమిళనాడు, చత్తీస్‌గఢ్ వంటి కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు రూ.500 నుంచి రూ.900 వరకు బోనస్ ఇచ్చి పంట కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ధాన్యం క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించాలని, ఆర్‌బికె నిర్ణయించిన తేమ శాతం, తూకం తోనే మిల్లుల వద్ద ధాన్యం అన్‌లోడ్ చేసుకోవాలని, రైతుల నుంచి మిల్లుల వద్ద డబ్బులు వసూలు చేయడం ఆపాలని, నాణ్యమైన గోనె సంచులు ఆర్‌బికె కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచి రైతులకు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దొంగల నాగేశ్వరరావు, బండారు వెంకటేశ్వరరావు, పిండి సుబ్బారావు, నీలం సూర్యనారాయణ, పెనుమత్స బంగార్రాజు, టి.సత్యనారాయణ, ఎస్.రామకృష్ణ పాల్గొన్నారు.

ఆర్థిక బకాయిలు చెల్లించాలని ఆక్రందన దీక్ష

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్రవ్యాప్తంగా 13 లక్షల మంది ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్లకు రావాల్సిన ఆర్థిక బకాయిలు రూ.30 వేల కోట్లు చెల్లించాలని ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయిశ్రీనివాస్, హెచ్.తిమ్మన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద శనివారం ఆక్రందన దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో పనిచేస్తున్న రెండు లక్షల మంది ఉపాధ్యాయుల ఆర్థిక సెలవు బకాయిలు రూ.800 కోట్లు, భవిష్య నిధి బకాయిలు, జీవిత బీమా బకాయిలు, కరువు భత్యం బకాయిలు, 11వ పిఆర్‌సి బకాయిలు మొత్తం కలిపి సుమారు రూ.3 వేల కోట్లు ఆర్థిక బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జవహర్‌లాల్‌రాజు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గుత్తుల శ్రీనివాస్, కార్యదర్శి సాయి వర్మ, జిల్లా ఉపాధ్యక్షులు దావీదు పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'తో పేదలకు సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - కాళ్ల

పేదలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎంతో దోహదపడుతుందని జెడ్‌పిటిసి సభ్యులు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు అన్నారు. మండలంలోని బొండాడపేటలో సర్పంచి వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన సందర్శించారు. వైద్యులు ఎం.గులాబ్‌రాజ్‌కుమార్, వైద్య సిబ్బంది, ఆశా, అంగన్‌వాడీ వర్కర్లు పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి చెన్ను సుజాత ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు గుత్తికొండ సత్యనారాయణ, కోపల్లె సొసైటీ అధ్యక్షులు వేగేశ్న జయరామకృష్ణంరాజు, వైసిపి మండల కన్వీనర్ గణేశ్న రాంబాబు, పి.రంగరాజు పాల్గొన్నారు.

గణపవరం :జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్య శిబిరాలను పేదలు వినియోగించుకోవాలని ఎంపిడిఒ జి.జ్యోతిర్మయి అన్నారు. పిప్పర సచివాలయం వద్ద శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు ఈ సందర్భంగా గ్రామ సర్పంచి కాకర బేబి అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎంపిడిఒ మాట్లాడారు. శిబిరంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటుచేసిన పోషకాహార స్టాల్స్ ఆకిర్షించాయి. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పి.లక్ష్మి, మండల ప్రత్యేకాధికారి కె.శ్రీనివాస్, ఇఒపిఆర్‌డి పివి.సత్యనారాయణ, ఎంపిడిఒ పి.శేషు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఆచంట : మండలంలోని భీమలాపురం గ్రామంలో సర్పంచి గుబ్బల మాధవరావు అధ్యక్షతన నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య, ఎంపిపి సూర్యకుమారి మాట్లాడారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పౌష్టికాహారం స్టాల్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నరసింహప్రసాద్, వైద్యాధికారులు రామాంజనేయులు, వర్మ, హైందవి, సత్యవతి, ఆరోగ్యశ్రీ టీం లీడర్ రాంబాబు, ఆరోగ్య మిత్ర కనకదుర్గ పాల్గొన్నారు.

కాళ్ల : బొండాడపేటలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం

వీరవాసరం : ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల వద్ద ఐసిడిఎస్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అంగన్‌వాడీ పోషకాహారంపై అవగాహన కల్పిస్తూ ఏర్పాటు చేసిన స్టాల్స్ పట్ల భీమవరం ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ సంతృప్తి వ్యక్తం చేశారు. వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. అంగన్‌వాడీ పోషకాహార స్టాల్ పరిశీలించారు. వీరవాసరం చినదళితపేటకు చెందిన శ్మశానానికి వెళ్లేందుకు గోగులమ్మ ఆలయం వద్ద ఉన్న రహదారిని అభివృద్ధి చేయాలని ఎంఎల్‌ఎ దృష్టికి నేత జ్ఞానసుందరరాజు తీసుకెళ్లారు. బొంతువారిపేటలోని సీసీ రహదారి నిర్మాణం అవసరమై బొంతు రమేష్ ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సానుకూలంగా స్పందించి ఇఒపిఆర్‌డి టి.విజయసారధిని ఆదేశించారు.

నరసాపురం టౌన్ : మండలంలోని వేములదీవి పడమర పంచాయతీ కాపుల కొడప తుపాన్ షెల్టర్ వద్ద నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. తొలుత వేములదీవి పడమర గ్రామంలో సరుగుడు తిప్ప రూ.35 లక్షలు జెడ్‌పి నిధులతో నిర్మించిన పుంత రోడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు బొక్క రాధాకృష్ణ, వైస్ ఎంపిపి ఉంగరాల రమేష్ నాయుడు, జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షులు అంద్రాజు చల్లారావు, ఎంపిటిసి సభ్యులు వీర్రాజు, సర్పంచి ఒడిగి ఏసుబాబు పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : పట్టణంలోని ఆరో వార్డులో నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించి మాట్లాడారు. సిఎం జగన్ ప్రజారోగ్యానికి పెద్దపీట వేశారన్నారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, పట్టణ అధ్యక్షులు తోట భోగయ్య, గాదిరాజు రామరాజు, చింతల పాటి నరసింహరాజు, కట్టా రవిశంకర్, కముజు చిన్న, కముజు శ్రీనివాస్, ములపల్లి స్వామి, కొత్తల కృష్ణబాబు, వాసర్ల ప్రవీణ్, వాసంశెట్టి శ్రీనివాస్, అల్లూరి రాజేష్, గంటా సుందర్‌కుమార్, చిగురుపాటి రాజు పాల్గొన్నారు.

పెనుగొండ : మండలంలోని వడలి గ్రామ సచివాలయం పరిధిలో హైస్కూలులో నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో సర్పంచి కాసాని విజయకుమారి మాట్లాడారు. జనరల్ డాక్టర్ పావని, డాక్టర్ ఉమా మహేశ్వరి, డాక్టర్ చంద్రశ్రావణి, డాక్టర్ కోటేశ్వరరావు, కంటి వైద్య నిపుణులు ఆనంద్ వైద్య సేవలందించారు. ఎంపిటిసి సభ్యులు రెడ్డిగణేష్‌రావు, ఎంపిటిసి సభ్యులు చిటికెన భవాని దుర్గాప్రసాద్, బండారు ప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉండి : మండలంలోని ఉనుదుర్రులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి పిన్నమరాజు నాగలక్ష్మి, ఎంపిటిసి సభ్యులు అల్లూరి మాధవి, పార్టీ గ్రామ అధ్యక్షులు కూనపరాజు వర్మ, నాయకులు గొర్రెముచ్చు సుందర్‌కుమార్, పైలా సత్యనారాయణ, ఎండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాలకోడేరు : ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు అన్నారు. శృంగవృక్షంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని పివిఎల్ నరసింహరాజు, డిసిఎంఎస్ ఛైర్మన్ వేండ్ర వెంకటస్వామి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి జంగం సూరిబాబు, ఉప సర్పంచి కలిదిండి ఆనందరాజు, నాయకులు కలిదిండి కృష్ణంరాజు, ఎంపిటిసి సభ్యులు, మల్లుల సూర్యకళ, కటిక శ్రీదేవి, ఆదాడ లక్ష్మీతులసి, నరేష్, సిహెచ్‌వివి.పాపారావు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టుపై కొనసాగిన నిరసనలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

చంద్రబాబు అరెస్టుపై టిడిపి భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి, పార్టీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాబుతో నేను కరపత్రాల పంపిణీ కార్యక్రమం 14వ వార్డులో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మామిడిశెట్టి ప్రసాద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గునుపూడి తిరుపాల్, ఏసుపాదం, మాదాసు కనకదుర్గ, కోళ్ల నాగబాబు, బొక్క సూరిబాబు, జంపన ధనరాజ్, గణపతి, సయ్యద్, నసీమబేగం, ఎండి షబీనా, గంధం రాధ, నేదునూరి గంగాధర్ తిలక్, నల్లం గంగాధర్, పడమట నరసింహమూర్తి, దొంగ వెంకటేశ్వరరావు, యలమంచిలి శ్రీనివాస్, బొక్క శ్రీనివాస్, భూపతిరాజు బుజ్జిరాజు పాల్గొన్నారు.

ఆచంట : చంద్రబాబు అరెస్టుపై నిరసనగా ఆచంటలో టిడిపి నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 39వ రోజు శనివారం కొనసాగాయి. తొలుత ఎన్‌టిఆర్ విగ్రహానికి, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ఉప్పలపాటి సురేష్‌బాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, నాయకులు బీరా నరసింహమూర్తి, బోడపాటి దుర్గాప్రసాద్, తాళం శ్రీనివాసరావు, ఆకుమర్తి మోహన్ పాల్గొన్నారు.

మొగల్తూరు : చంద్రబాబుపై వైసిపి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించడం దారుణమని టిడిపి నాయకులు అన్నారు. మండలంలోని వారతిప్పలో న్యాయదేవత చిత్రపటాలతో శనివారం టిడిపి నాయకులు చేశారు. తొలుత గ్రామంలో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగిడి రాంబాబు, తిరుమాని పెంటయ్య, దొంగ సత్యనారాయణ, శ్రీను, కడలి నాగేశ్వరరావు, తిరుమని శ్రీనివాసరావు, బసవాని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పాలకొల్లు : చంద్రబాబు అరెస్టుపై నిరసనగా పాలకొల్లు నియోజకవర్గ 7, 8, 15 యూనిట్ల టిడిపి నేతలు శనివారం 39వ రోజు దీక్షల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిడిపి యలమంచిలి మండల మాజీ అధ్యక్షులు చిట్టూరి రామాంజనేయులు మాట్లాడారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి

ప్రజాశక్తి - పాలకొల్లు

పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ చెప్పారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పాలకొల్లు పటణ పోలీస్ స్టేషన్ నుంచి ప్రధాన వీధుల గుండా శనివారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. పట్టణ ఎస్ఐ ముత్యాల రావు, టిడిపి నేతలు జివి, జనసేన జిల్లా కార్యదర్శి బోనం చినబాబు, వైసిపి నాయ కులు కొండేటి చినబాబు, ముత్యాల శ్రీనివాస్, పలువురు ఎఎస్ఐలు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో ముగిసిన శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మార్టేరు శాఖ గ్రంథాలయంలో దసరా సెలవుల సందర్భంగా నిర్వహించిన శిక్షణా తరగతులు శనివారంతో ముగిశాయని గ్రంథాలయ అధికారి పిటి శివకుమార్ తెలిపారు. ముఖ్య అతిథులుగా లెక్చరర్ పి.కుమార్, రేడియో ప్రసంగికులు ఎల్‌వి.సూర్యనారాయణమూర్తి, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ జె.రేవంత్‌సాయి హాజరయ్యారు. విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, చదరంగం పోటీలు నిర్వహించారు.

నరసాపురం టౌన్ : నరసాపురం ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. నిర్వహించిన పోటీల్లో విజేతలకు శాస్త్రవేత్త సుబ్బారావు, కె.శ్రీనివాస్ బహుమతులు అందించారు. గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కెజెఎస్ఎల్.కుమారి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

పేరు మార్పు

పశ్చిమ గోదావరి జిల్లా, పెంటపాడు మండలం, పెంటపాడు గ్రామం, హెచ్.నెం. 4-29, వెలమపేట కాపురస్తులు లేటు శిరపు సుబ్బారావు గారి సతీమణి శిరపు సింహాచలం అనే శిరపు సింహాచలము తెలియజేయునది ఏమనగా నా ఆధార్ కార్డు నందు నా పేరు **శిరపు సింహాచలము** గా ఉంది. కావున ఇకపై నా పేరును **శిరపు సింహాచలం అనే శిరపు సింహాచలము** గా పరిగణించవలెనని తెలియజేయుచున్నాను.

శిరపు సింహాచలం అనే శిరపు సింహాచలము
హెచ్.నెం. 4-29, వెలమపేట, పెంటపాడు, పెంటపాడు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా.

In The Court Of The Hon'ble 7th Additional District Judge Cum Family Court Judge West Godavri :: Eluru
I.A.No. 29/2022, O.S.No. 68/2021

Between:
Sukhavasi Srinivasa Rao & anothers ***...Petitioners***
AND
Gorrela Prasad & 2 Others ***...Respondents***

2nd Respondent: Velagala Lakshmi Subhashini @ Gorrela Subhasani, W/o. Ravi Kumar, Cultivation, R/o. D.No. 2-11, Sitharampuram, Chakraigudem, Pedavegi Mandal, W.G.Dist.

అను వారికి నోటీసులు అమలు కొరకు పై కోర్టు వారి ఎదుట **ది.31-10-2023 ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరు అయ్యి తమ ఆక్షేపణలు తెలుపుకొనగలరు.** లేని ఎడల తమ పరోక్షమున సంగతులు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

B.A.REDDY
B.J.REDDY, Advocates,
Eluru. Cell: 97032 34999

In The Court Of The Hon'ble 7th Additional District Judge Cum Family Court Judge West Godavri :: Eluru
O.S.No. 68/2021

Between:
Sukhavasi Srinivasa Rao & anothers ***...Plaintiffs***
AND
Gorrela Prasad & 2 Others ***...Defendants***

2nd Defendant: Velagala Lakshmi Subhashini @ Gorrela Subhasani, W/o. Ravi Kumar, Cultivation, R/o. D.No. 2-11, Sitharampuram, Chakraigudem, Pedavegi Mandal, W.G.Dist.

అను వారికి నోటీసులు అమలు కొరకు పై కోర్టు వారి ఎదుట **ది.31-10-2023 ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరు అయ్యి తమ ఆక్షేపణలు తెలుపుకొనగలరు.** లేని ఎడల తమ పరోక్షమున సంగతులు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

B.A.REDDY
B.J.REDDY, Advocates,
Eluru. Cell: 97032 34999

In The Court Of The 1st Additional Junior Civil Judge-Cum-1st Additional Judicial Magistrate of 1st Class, Tadepalligudem
O.S.No. 491/2021

In Between:
Yempalla Suhasini ***...Plaintiff***
AND
Marapatla Jyothi and another ***...Defendants***

1st Defendant /Respondent: Smt. Marapatla Jyothi, W/o. Late Suneel Kanth, Female, Aged 40 Yrs, R/o. Opp. RCM Church, Chinanindrakolanu Village, Nidamarru Mandal, Eluru Dist.

పై నెంబరు దావాలో వాది 1వ ప్రతివాది అయిన మీపై దావా దాఖలు చేసినప్పటి నుండి 1వ ప్రతివాది అయిన మీరు ఎన్ని పర్యాయములు నోటీసు పంపినప్పటికి మీరు తీసుకొనని కారణంగా శ్రీ కోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా 1వ ప్రతివాది అయిన మీకు నోటీసులు అమలు నిమిత్తం **ది.07-11-2023వ తదీ సం॥రం వాయిదా వేసియున్నారు.** ఆరోజున ఉదయం గం॥ 10:30 ని॥ల లగాయితూ మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరు అయ్యి ఆక్షేపణలు ఉన్న ఎడల తెలుపుకొనవలెను. లేని ఎడల మీపరోక్షముగా తీర్మానించబడును.

INJETI RAJESH
Advocate, Tadepalligudem.
Cell: 99120 17174